# పదివేళ్ళూ పనిచేస్తాయి...

ఊహకూ, వాస్తవానికీ మధ్య, బతుక్కూ భావనకూ మధ్య ఎక్కడా పొంతన ఉండదన్న నగ్న సత్యాన్ని బాలయ్య జీవితం మరోసారి రుజువు చేసింది.

బాలయ్య బాల్యం, రంగరంగ వైభవంగా లేకపోవచ్చుగానీ, అష్టకష్టాలమయం కూడా కాదు. బాలయ్య తండ్రి పేరు నాగయ్య. అతను తన జీవితాన్ని పొలాల్లో ప్రారంభించాడు. పశువుల కాపరిగా కొంతకాలం పనిచేశాడు. నాగలి చేత పట్టి, వందలసార్లు బీడు భూముల్ని సాగుకు లాయకీగా మార్చాడు. కొంతకాలం వ్యవసాయ కూలీల సంఘంలో పనిచేశాడు. ఆ సంఘానికి నాగయ్య వల్ల ఏం ఒరిగిందో తెలీదు గానీ, నాగయ్యకు మాత్రం ఆ ఊళ్ళో ఏ రైతు దగ్గరా పనిదొరకలా.

ఎంతకాలమని పస్తులుంటారు గనుక! పాడిగేదెనూ, పూరిపాకనూ అయినకాడికి అమ్మేశాడు. ఆ డబ్బును పెళ్ళాంకిచ్చి సత్తెనపల్లి పంపించాడు. సత్తెనపల్లిలో లక్ష్మమ్మ అన్నకు కిల్లీకొట్టు ఉంది. లక్ష్మమ్మ వదినె అదేదో పొగాక్కంపెనీలో గ్రేడింగ్ మేస్త్రీగా వుంటున్నది. కొంతకాలం పాటు - తను కాస్తా కాలుకుదురుకొన్నదాకా అన్నదగ్గరుంటే తరువాత చూసుకోవచ్చుననుకొన్నాడు నాగయ్య.

అతను మెల్లిగా ముఠాకూలీల్లో చేరాడు. తరువాత, తనే కూలీల్ని గుత్తకు తీసుకోవడం ప్రారంభించాడు. లారీల మీద సరుకుల్ని ఎత్తడంలోనూ, వాటిని సురక్షితంగా చేర్చడంలోనూ నాగయ్య ముఠాకు మంచి పేరు వచ్చింది.

నాగయ్య కష్టపడి పనిచేయడానికి ఎప్పుడూ వెనక్కుతీయడు. అనేకసార్లు అతను రాత్రింబవళు ళ్ళ లారీల మీద పని చేశాడు. ప్రయాణాలు చేశాడు. అలా చేస్తున్నప్పుడే అతను లారీని నడపడం కూడా నేర్చుకొన్నాడు. అతను లైసెన్సు లేకుండానే చాలసార్లు లారీని నడిపాడు. చిన్న చిన్న రిపేర్లు చేయడం కూడా నాగయ్యకు తెలిసింది!

ఈ లోగానే అతను భార్యను తెచ్చుకొన్నాడు. ఓ చిన్న పెంకుటిల్లును అద్దెకు తీసుకున్నాడు. లక్ష్మమ్మ సలహా మీద, కూలిపని మానేశాడు. నానా అవస్థా పడి, మూడు నాలుగేళ్ళ తరువాత లారీ డ్రైవర్‌గా లైసెన్స్ సంపాదించుకొన్నాడు.

నాగయ్య నమ్మకస్తుడు. కష్టపడి పనిచేయడం అతని స్వభావంలానే ఉంది. దొంగబాడిగలు తోలడం, ఎక్కువకు వప్పుకొని తక్కువకు లెక్క చెప్పడం, మధ్యలో పాసింజెర్లను ఎక్కించుకొని, ఆ కిరాయిని కొట్టేయడం అతనికి చేతగాని పనులు.

రమారమిగా 14 సంవత్సరాల పాటు అతను లారీని నిర్విచారంగా నడిపాడు. అతను బొంబాయి, పూనా, కాన్పూరు, నాగపూరు, మద్రాసు, బెంగుళూరు, భువనేశ్వర్‌ల దాకా బండిని తోలుకెళ్ళేవాడు. ఎక్కువ బరువు వేయడం, దొంగ సరుకుల్ని చేరవేయడం- లారీ యజమాని వొత్తిడి చేసినా నాగయ్య చేయలేదు.

ఈ తిరుగుళ్ళ వల్ల బాలయ్యకు చదువు అబ్బలేదు. ఇంట్లో వుంటే బళ్ళోకి పోవాల్సి వస్తుంది గనుక, తండ్రితో పోవటానికే బాలయ్య సరదాపడేవాడు. అలాగా, ఏడెనిమిదేళ్ళు గడిచాయి. కొడుకును కూడా లారీ డ్రైవరును చేయాలని, నాగయ్య కలలు గన్నాడు. బండిని నడపడంలోని మెలకువలన్నీ

కొడుక్కి నేర్పాడు. రోడ్డు తిన్నగా ఉన్నప్పుడూ, ఎదురుగా బళ్ళేమీ లేనప్పుడూ, కొడుక్కు స్టీరింగునిచ్చేవాడే నాగయ్య. క్రమంగా బాలయ్య కూడా దోవనపడ్డాడు.

ఒకసారి లారీ నిండుగా దోసకాయలు ఎత్తుకుని, బెజవాడనుండి హైదరాబాదుకు ప్రయాణమయ్యాడు నాగయ్య. రాత్రి 9 గంటలు దాటింది. అడ్డరోడ్డు దగ్గర ఇద్దరూ టీలు తాగారు. తండ్రిని పక్కకు తప్పుకోమని తాను స్టీరింగు అందుకున్నాడు బాలయ్య. కొడుకు పక్కనే కూర్చుని సిగరెట్టు దమ్ము లాగుతున్నాడు నాగయ్య.

ఓ చిన్న మూలుగుతో లారీ బయలుదేరింది. ఎక్కుతూ, దిగుతూ మెలికలు తిరుగుతూ, లారీ రివ్వున ముందుకు దూసుకుపోతున్నది. పరిటాల దగ్గర సన్నగా ప్రారంభమయిన వాన, కంచికచర్ల దగ్గరకొచ్చేసరికి ధారాపాతంగా కురవడం సాగించింది. అక్కడే ఆగుదామనుకొన్నారు. కానీ, నందిగామలో అయితే తమకు తెలిసిన లారీ బ్రోకర్సు ఆఫీసు ఉంది. అక్కడ బండినాపుకుని ఆఫీసులో ఓ కునుకుతీసి, వాన వెలిశాక బయలుదేరవచ్చుననుకున్నారు.

కంచికచర్ల చెరువు దాటారు. పది నిమిషాలకల్లా మున్నేరు వంతెన వచ్చింది. అప్పటికి వాన కూడా హెచ్చింది. వైపర్లు ఎంత తుడిచినా, వాన నీరు ముందున్న అద్దాన్ని ముసురుకొని ముందేమున్నదో కనిపించడం లేదు.

బాలయ్య నెమ్మదిగా బండిని నడుపుతున్నాడు. వంతెన దాటింది. రోడ్డు కుడివేపుకు తిరిగింది. బాలయ్య బండిని కుడివేపుకు తిప్పాడు. ఎదురుగా మరో బండి - క్షణంలో ఏం జరిగిందో తెలియదు. లారీ జారి, కింద పల్లంలోకి బోల్తా పడింది.

నాగయ్య అక్కడికక్కడే చనిపోయాడు. బాలయ్య మోకాలు విరిగిపోయింది.

"మరిక నేను లారీ డ్రైవర్‌గా పనికిరానండీ! ఈ దెబ్బనుండి కోలుకోడానికి ఆరుమసాలు పట్టింది. ఈ ఆరుమాసాలపాటూ మా అయ్యగారే మమ్మల్ని పోషించారండీ!" అన్నాడు బాలయ్య.

ఆ అయ్యగారే తనకు తెలిసిన వారితో చెప్పి, బాలయ్యకు ఈ కుర్చీల అల్లకం పని నేర్పించారు. ఓ ఏడాది పాటు అక్కడే ఉండి ఈ పని నేర్చుకొన్నాడు బాలయ్య.

"అయ్యగారు వెయ్యి రూపాయలిచ్చారండీ! దాంతోనే ఇదిగో ఈ యాపారం నడుపుతున్నాను" అన్నాడు బాలయ్య.

అతను ప్లాస్టిక్ కేన్‌తో కుర్చీలు, టీపాయ్‌లూ, బల్లలూ, మంచాలూ అల్లుతాడు.

"ప్లాస్టిక్ సరుకులో మూడు నాలుగు రకాలున్నాయండి! బొంబాయి రకం మంచిది. హైదరాబాద్ రకం రెండోది. రాంనగర్, ఢిల్లీ రకాలు మరీ నాసివండీ! గోల్డు కలర్ ప్లాస్టిక్, మిగిలిన రంగులయితే 20, 21 వొక్కోసారి 22 కూడా అమ్ముతుంది. ఇనప ఫ్రేములు, 14, 15 రూపాయలదాకా ఉంటాయి. మంచి రకం కేన్ అయితే 7, 8 రూపాయల సరుకు పడుతుంది. అల్లకం, కూలి 5 రూపాయలు. కుర్చీకి రంగు వేయడానికి, రబ్బరు బుష్‌లు పెట్టడానికి రూపాయిదాకా అవుతుంది." అన్నాడు బాలయ్య.

తను కుర్చీ ఖరీదు 35 చెబుతాననీ, 30 కయినా ఇస్తాననీ, అంతకు తక్కువయితే గిట్టుబాటు కాదనీ అన్నాడు. పాత కుర్చీలు కూడా బాలయ్య బాగు చేస్తాడు. కేన్ వారే తెచ్చుకొంటే, మజూరి 5

తీసుకొంటాడు. మొత్తం తనదే అయితే 12, 13 దాకా ఛార్జీ చేస్తాడు.

"రోజుకు రెండు కుర్చీలకన్నా అల్లకం సాగదండీ! బుచ్చికం పనులు చేయడం నా వల్లకాదు. మిగిలిన వాళ్లు నాలుగు రూపాయలక్కూడా అల్లుతారు. ఆ సరుకూ, ఆ పనికూడా అడవాగానే ఉంటుందండీ!" అన్నాడు బాలయ్య.

అలవీసులవలుగా చేస్తే, రోజుకు మూడు కుర్చీలను కూడా అల్లవచ్చుననీ, కానీ పని మాత్రం తిన్నగా ఉండదని అన్నాడు బాలయ్య.

తను సంపాదించిన పది రూపాయల్లోనూ కొట్టు అద్దెకింద మూడు, మిగిలిన ఆర్రూపాయలూ ముద్దరసుద్దిగా తల్లికిస్తున్నానంటున్న బాలయ్య ఎప్పుడోగానీ సినిమాలు చూడడు.

"పది వేళ్ళతో పనిచేసినా, ఐదు వేళ్ళూ నోటికి చేరని, నాబోటివాడికి సినిమా లెందుకండీ బాబూ?" అని ప్రశ్నించాడు బాలయ్య.

పూటబత్తెం పుల్లవెలుగ్గా ఉండే అతని బతుకు, ఇంతకన్నా మెరుగుపడేదెప్పుడో మరి!